https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

ఛైర్మన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 316 సోమవారం 2-2-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

## సౌమ్య కుటుంబానికి రూ.కోటి పరిహారం

ఆమె తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం..

ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు మంత్రి జూపల్లి నివాళి

మోస్రాలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

**నిజామాబాద్, ఫిబ్రవరి 1:** విధి నిర్వహణలో ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య చూపిన తెగువ, నిబద్ధత స్ఫూర్తిదాయకమని ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సౌమ్య కుటుంబ సభ్యులకు రూ.కోటి పరిహారం, ఆమె తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. ఆదివారం సౌమ్య మృతదేహానికి గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అక్కడికి వెళ్లిన మంత్రి జూపల్లి.. సౌమ్యకు నివాళు లర్పించారు. ఎక్సైజ్ ఉద్యోగులు ఒక రోజు వేతనం రూ.50 లక్షలను సౌమ్య కుటుంబానికి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారని జూపల్లి తెలిపారు. విధి నిర్వహణలో సౌమ్య అంకిత భావాన్ని, ధైర్య సాహసాలను కొనియాడుతూ హైదరాబాద్ సీపీ సజ్జనార్ ట్వీట్ చేశారు. కాగా, సౌమ్య అంత్యక్రియలు నిజామాబాద్ జిల్లా మోస్రా లో ఆదివారం సాయంత్రం అధికార లాంఛనాలతో జరిగాయి. మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివ్ష?సరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఎక్సైజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్‌రావు, నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎక్సైజ్ శాఖ జిల్లా ఉద్యోగులు, పోలీసు సిబ్బంది, మోస్రా గ్రామ ప్రజ లు పెద్ద సంఖ్యలో అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పోచారం శ్రీనివ్షసరెడ్డి, సీపీ సాయి చైతన్య సౌమ్య పాడె మోశారు. తండ్రి సాయిలు సౌమ్య చితికి నిప్పంటించారు.



## చంద్రబాబుకు ఈడీ క్లీన్‌చిట్!

స్కిల్ కేసులో ఆయన ప్రమేయంపై ఆధారాల్లేవు

విశాఖ పీఎంఎల్ఏ కోర్టులో అనుబంధ చార్జిషీటు

ఆయన పాత్ర లేదు.. నిందితుడిగా చేర్చలేం: ఈడీ


చార్జిషీటును పరిగణనలోకి తీసుకున్న కోర్టు

ఈ కేసులో గత నెలలోనే ఆయనకు సీఐడీ క్లీన్‌చిట్

నాడు నానా గగ్గోలు పెట్టిన జగన్ అండ్ కో

నేడు ఈడీ తేల్చేయడంతో మూతబడిన నోళ్లు

**అమరావతి, ఫిబ్రవరి 1**



స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా ముఖ్యమంత్రి చంద్రబాబుకు క్లీన్ చిట్ ఇచ్చింది. ఈ కేసులో కొందరు నిందితులు ప్రభుత్వ నిధులు మళ్లించినట్లు గుర్తించామని.. కానీ చంద్రబాబు పాత్ర మాత్రం లేదని పేర్కొంది. అందువల్ల ఆయన్ను ఈ కేసులో నిందితుడిగా చేర్చలేమని తెలిపింది. గత నెల 28న విశాఖపట్నంలోని ప్రత్యేక పీఎంఎల్ఏ (మనీలాండరింగ్ నిరోధక చట్టం) కోర్టులో తాను దాఖలు చేసిన అనుబంధ చార్జిషీటును న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుందని ఈడీ ఓ ప్రకటనలో వెల్లడించింది. దీంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించి.. తప్పుడు కేసులో చంద్రబాబును అరెస్టుచేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపునకు కారణమైన స్కిల్ కేసు కథ దాదాపు ముగిసినట్లేనని న్యాయనిపుణులు అంటున్నారు. చంద్రబాబుకు ఎలాంటి సంబంధం లేని ఈ కేసులో ఆయన్ను ఇరికించి, అక్రమంగా అరెస్టుచేసి 53 రోజులు రాజమండ్రి సెంట్రల్ జైలులో పెట్టి.. సరైన సౌకర్యాలు కల్పించకుండా నరకయాతన పెట్టిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఆయన అవినీతికి పాల్పడ్డారనడానికి ఎలాంటి ఆధారాలూ లేవని, కేసును మూసివేయాలని దర్యాప్తు సంస్థ సీఐడీ కోరడంతో గత నెల 12న ఏసీబీ కోర్టు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.

# ఆదేశాలిచ్చింది మీరేనా?

## మావోయిస్టుల పేరిట ఫోన్లను ట్యాపింగ్ చేయించారా?

ఎన్నికల్లో గెలుపునకు ఆయుధంగా మార్చుకున్నారా?

రిటైరైన అధికారులను ఎందుకు కొనసాగించారు?

వ్యాపారుల్ని బెదిరించడం వల్లే ఎన్నికల బాండ్లు వచ్చాయా?

'ఎమ్మెల్యేల కొనుగోలు' ఆడియోలు మీకెలా వచ్చాయి?

మాజీ సీఎం కేసీఆర్‌పై సిట్ అధికారుల ప్రశ్నల వర్షం

నందినగర్‌లోని ఇంట్లో నాలుగున్నర గంటలు విచారణ

అవసరమైతే మరోసారి విచారిస్తామని సమాచారం!

ఆ సమయంలో ఇంట్లోనే కేటీఆర్.. లాయర్లకు అనుమతి నో

విచారణ అనంతరం సిట్ చీఫ్‌ను కలిసిన దర్యాప్తు బృందం



**హైదరాబాద్, ఫిబ్రవరి 1**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అనధికార, అక్రమ టెలిఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్‌ను సిట్ అధికారులు ఆదివారం విచారించారు. నందినగర్‌లోని ఆయన నివాసంలో నాలుగున్నర గంటలకుపైగా ఈ విచారణ కొనసాగింది. విచారణలో భాగంగా.. ప్రభుత్వ అధినేతగా మీకు తెలిసే టెలిఫోన్ ట్యాపింగ్ జరిగిందా? మావోయిస్టుల పేరిట కొన్నివేల మంది ఫోన్లను ట్యాపింగ్ చేయించారా? పదవీ విరమణ పొందిన అధికారులను కీలక బాధ్యతల్లో ఎందుకు కొనసాగించారు? పలు ఎన్నికల్లో గెలుపు నకు ఫోన్ ట్యాపింగ్ మీకు ఒక ఆయుధంగా మారడం వల్లే దానిని కొనసాగించారా? ఫోన్ ట్యాపింగ్ వల్ల వచ్చిన సమా చారం ఆధారంగా బెదిరింపులకు పాల్పడటంతోనే బీఆర్ఎస్ పార్టీకి ఎలక్టోరల్ బాండ్లు పెద్ద మొత్తంలో వచ్చాయా? అంటూ సిట్ అధికారులు కేసీఆర్‌పై ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది. సిట్ విచారణ కోసం కేసీఆర్ ఆదివారం ఉదయమే ఎర్రవల్లి ఫామ్‌హౌస్ నుంచి బయలుదేరి నందినగర్‌లోని నివాసానికి చేరుకున్నారు. అయితే కేసీఆర్‌ను సిట్ విచారిం చడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు రాష్ట్రవ్యా ప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. దీంతో నందినగర్ ప్రాంతంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 3గంటలకు విచారణ ప్రారంభించిన అధికారులు.. అందుకు కొద్దిస మయం ముందుగానే అక్కడికి వచ్చారు. కేసీఆర్ నివాసం లోని రెండో అంతస్తులోని ఒక గదిలో విచారణకు సంబంధిం చిన ఏర్పాట్లు చేసుకున్నారు. రెండు ట్రంక్ పెట్టెల్లో కేసుకు సంబంధించిన అత్యంత కీలకమైన ఎలక్ష?ట్రనిక్ సాక్ష్యాధా రాలను, కొన్ని రికార్డులను తీసుకుని వచ్చారు. కేసీఆర్ విచార ణను ఆసాంతం.. ఆడియో, వీడియో రికార్డింగ్ చేసేలా ఏర్పాట్లు చేశారు. కేసీఆర్ కుమారుడు కేటీఆర్ ను విచారణ సమయంలో ఉండటానికి సిట్ అధికారు లు అనుమతి ఇచ్చారు. ఇంట్లో ఉన్న హరీశ్‌రావు తదితర నేతలను బయటకు పంపేశారు. కేసీఆర్ న్యాయవాదులను అక్కడికి అనుమతిం చలేదు. విచారణ సందర్భంగా సిట్ అధికారులు ప్రధానంగా.. సీఎం ఆదేశాలు కిందిస్థాయికి ఏ విధంగా చేరుతాయనే విషయంపై ఆరా తీసినట్లు సమాచారం. అనధికార, అక్రమ ఫోన్ ట్యాపింగ్‌లో కీలకపాత్ర పో షించిన అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు, ఆయన బృందంలోని ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న ఇచ్చిన వాంగ్మూలాలతోపాటు టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకి షన్‌రావు వాంగ్మూలం ఆధారంగా కేసీఆర్‌ను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఎవరిపైనిఘా పెట్టాలనే దానిపై తమకు సీఎంవో నుంచి ఆదేశాలు వచ్చేవని రాధాకిషన్‌రావు తన వాంగ్మూలంలో పేర్కొన్న నేపథ్యంలో 'మీరు ఇలాంటి ఆదేశాలు ఇచ్చారా? రాధాకిషన్‌రావుకు మీ ఆదేశాలు ఏ విధంగా అందేవి?' అని సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. అంతేకాకుండా.. రాధాకిషన్‌రావు, ప్రభాకర్‌రావును పదవీ విరమణ తర్వాత కీలక హోదాల్లో కొనసాగించడానికి కారణమేంటని ప్రశ్నించగా.. ఆ నిర్ణయం పోలీసు ఉన్నతాధికారులు తీసుకుంటారని, తాను కాదని కేసీఆర్ బదులిచ్చినట్లు తెలిసింది.

# సుంకాలకు జంకం.. ఆత్మనిర్భర శంఖం

## ట్రంప్ దెబ్బతో కుదేలైన రంగాలకు చేయూత

- 'కస్టమ్స్' తగ్గింపు.. ఎగుమతులు పెంచే వ్యూహాలు - దేశంలో మరిన్ని మెగా టెక్స్‌టైల్ పార్కులు
- రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్లు.. ఏపీకి ఒకటి - 2047 వరకూ డేటా సెంటర్లకు ట్యాక్స్ హాలిడే
- మూలధన వ్యయం లక్ష కోట్లు పెంపు - నిర్మాణ, తయారీ రంగాలకు మరింత ప్రోత్సాహం
- సెమీ కండక్టర్ పరిశ్రమకు 40 వేల కోట్లు - 2 లక్షల కోట్ల మేర తగ్గిన పన్ను వసూళ్లు
- పలు పథకాలకు కేటాయింపుల్లో కోతలు - 9వసారి బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మల
- ఎస్టీటీ దెబ్బ.. సెన్సెక్స్ 1,546 పాయింట్లు పతనం



**హైదరాబాద్ :**

జాతీయ, అంతర్జాతీయ సవాళ్లకు దీటుగా బడ్జెట్‌లో 'స్వదేశీ మంత్రం' పఠించారు! సుంకాలకు జంకేది లేదంటూ ఆత్మ నిర్భర అస్త్రానికి పదును పెట్టారు! ట్రంప్ సుంకాలతో దెబ్బతిన్న రంగాలకు 'కస్టమ్స్' తగ్గించారు! నిర్మాణ, తయారీ రంగాలకు మరింత 'బూస్ట్' ఇచ్చారు! గ్లోబల్ మార్కెట్లతో కలిసిమెలిసి సాగాలని.. ఎగుమతులను మరింతగా విస్తరించాలని సంకల్పించారు! జెన్‌జీకి జైకొట్టారు! ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేందుకు సంకల్పం చెప్పుకొన్నారు! వ్యక్తిగత ఆదాయ పన్ను విషయంలో మాత్రం ఎటువంటి మార్పులూ చేయలేదు. ఉద్యోగులకు ఎటువంటి ఊరట కల్పించలేదు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.53.47 లక్షల కోట్ల బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఇందులో మూలధన వ్యయానికే రూ.12.21 లక్షల కోట్లను కేటాయించారు. గత ఏడాదితో పోలిస్తే 8 శాతం అంటే.. దాదాపు లక్ష కోట్లను పెంచారు! భారత్ సహా ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య చిప్‌ల కొరత! దాని పరిష్కారానికి గతంలో ఏర్పాటు చేసిన ఇండియా సెమీకండక్టర్ మిషన్‌ను విస్తరించారు. రూ.22,919 కోట్లతో గత ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభించిన ఎలక్ష?ట్రనిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫాక్చరింగ్ స్కీమ్‌కు కేటాయింపులను రూ.40 వేల కోట్లకు పెంచారు. అంతేనా, ఇప్పుడు ప్రపంచమంతా రేర్ ఎర్త్ మినరల్స్ చుట్టూ తిరుగుతోంది. అందుకే, గత ఏడాది నవంబరులో ప్రారంభించిన రేర్ ఎర్త్ పర్మినెంట్ మాగ్నెట్స్ స్కీముకు కొనసాగింపుగా రేర్ ఎర్త్ కారిడార్స్ ఏర్పాటు చేయనున్నారు. ఆ ఖనిజాలు అధికంగా ఉన్న ఒడిసా, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చేయూత ఇవ్వనున్నారు. ఎగుమతి చేసే సముద్ర ఉత్పత్తుల ప్రాసెసింగ్‌కు ఉపయోగించే నిర్దిష్ట ముడి సరుకులపై సుంకం లేని దిగుమతుల పరిమితిని ఒకటి నుంచి మూడు శాతానికి పెంచారు. లెదర్, జౌళి ఉత్పత్తులు, సింథటిక్ ఫుట్‌వేర్ ఉత్పత్తుల ఎగుమతుల గడువును ఆరు నెలల నుంచి ఏడాదికి పెంచారు. కొన్ని రకాల రసాయనాల కోసం పూర్తిగా దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తోంది. అందుకే, మూడు కెమికల్ పార్కులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే, కంటెయినర్ల తయారీకి ఇప్పుడు డిమాండ్ పెరిగింది. అందుకే, రాబోయే ఐదేళ్లలో ఇందుకు రూ.10 వేల కోట్లను ఖర్చు చేయాలని సంకల్పించారు. బయో ఫార్మా మాన్యుఫాక్చరింగ్ హబ్ ఏర్పాటుకు రూ.10 వేల కోట్లను కేటాయించారు. ట్రంప్ సుంకాలతో దెబ్బతిన్న టెక్స్‌టైల్ రంగం అభివృద్ధికి సమ్మిళిత, సమగ్ర వ్యూహాన్ని రచించారు. మరిన్ని మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. 'స్వదేశీ'కి మూడంచెల వ్యూహాన్ని సిద్ధం చేశారు. మొదటి దశలో.. ఇతర దేశాలపై ఆధారపడాల్సి వస్తున్న రక్షణ, ఇంధన, ఆరోగ్య రంగాల్లో స్వయంసమృద్ధిపై వెంటనే దృష్టి పెట్టనున్నారు. ఐదు మెడికల్ హబ్‌లు, మూడు ఆయుర్వేద సంస్థలను ఏర్పాటు చేస్తారు. రెండో దశలో.. ఇతర దేశాలతో పోటీ పడేలా సెమీ కండక్టర్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ ఎగుమతులకు పెద్దపీట వేయనున్నారు. మూడో దశలో.. దేశీయంగా సరసమైన ధరకు దొరకని ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటారు. వెరసి, ఒక్క మౌలిక సదుపాయాల రంగాని (ఇన్ఫ్రా)కే దాదాపు రూ.12 లక్షల కోట్లను ఖర్చు చేయనున్నారు.

## ఎస్ఎల్‌బీసీ తవ్వకాల్లో జాప్యాన్ని సహించం

కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు డిజైన్లు సిద్ధం చేయాలి

అధికారులకు నీటిపారుదల మంత్రి ఉత్తమ్ ఆదేశాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 1**



శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం నిర్మాణ పనుల పునరుద్ధరణలో జాప్యాన్ని ఉపేక్షించ బోమని నీటిపారుదల మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. రక్షణ నియమాళిని పాటిస్తూ తక్షణమే యంత్రాలు, సిబ్బందిని రంగంలో దింపి రోజుకు 24 గంటల పాటు 3 షిఫ్టుల్లో నిరంతరం పనులు కొనసా గించాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఎల్‌బీసీతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల పునరుద్ధరణపై ఆదివారం ఇక్కడ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత గడువులోగా ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రాజెక్టు పనుల నిర్వహణకు చీఫ్ ఇంజనీర్(సీఈ)ను నియమించి అతడి పర్యవేక్షణ కింద ఎస్ఎల్‌బీసీ డివిజన్ పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. పనుల పర్యవేక్షణకు స్వతంత్ర కన్సల్టెంట్‌ను నియమించాలని కోరారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ డిజైన్ల తయారీని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 16 తర్వాత ఎన్‌డీఎ?సఏ నిపుణుల కమిటీతో సమావేశం నిర్వహించనున్నామని, ఇందుకోసం పునరుద్ధరణ ప్రణాళికతో ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు.

## మీరెందుకు చేశారో.. మేమూ అందుకే!

మేం ఏ తప్పూ చేయలేదని అర్థమై ఉంటుంది: కేటీఆర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 1**



"గతంలో రాహుల్, సోనియాలను ఈడీ విచారణకు పిలిస్తే రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు ఎందుకు ధర్నాలు చేశారో.. ఇప్పుడు పనికిరాని విచారణ పేరిట మా నాయకుడిని విచారణకు పిలిచినందుకు మేమూ ధర్నా చేశాం" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. తాము, తమ నాయకుడు ఏ తప్పూ చేయలేదని రాష్ట్ర పోలీస్ యంత్రాంగానికి, సిట్ అధికారులకు నేటితో అర్థమై ఉంటుందని వ్యాఖ్యానించారు. ఆదివారం నందినగర్ నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. లీకులు, అబద్ధాలు, అపోహలు సృష్టిస్తూ కాంగ్రెస్ నాయకులు పైశాచిక ఆనందం పొందుతున్నారని విమర్శించారు.

# 2026-27 కేంద్ర బడ్జెట్..అభివృద్ధికి బాటలు, ఆశలకు మోతాదు

**- సాదాసీదా బడ్జెట్... కానీ వ్యూహాత్మక దృష్టి - మూలధన వ్యయం, రక్షణ, రైల్వేలకు పెద్ద పీట**
**- తెలుగు రాష్ట్రాలకు ప్రత్యేక ప్రాధాన్యం**




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1**
కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మొత్తం వ్యయాన్ని రూ.53.47 లక్షల కోట్లుగా అంచనా వేస్తూ, ఆర్థిక లోటును జీడీపీలో 4.3 శాతానికి పరిమితం చేయడం ద్వారా ఆర్థిక క్రమశిక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది. భారీ సంస్కరణలు లేకపోయినా, స్థిరమైన వృద్ధికి దోహదపడే విధంగా బడ్జెట్ రూపకల్పన జరిగిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ బడ్జెట్‌లో మూలధన వ్యయానికి రూ.12.21 లక్షల కోట్లను కేటాయిస్తూ మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం స్పష్టమైన దృష్టి పెట్టింది. రక్షణ రంగానికి భారీ నిధులు కేటాయించడంతో పాటు, రైల్వే భద్రత, కొత్త రైలు మార్గాలు, మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. ఉపాధి హామీ పథకానికి ప్రత్యామ్నాయంగా 'విబిరామ్--జి' పథకాన్ని ప్రకటించడం ద్వారా ఉపాధి సృష్టిపై కొత్త దృక్పథాన్ని చూపినట్లు ప్రభుత్వం పేర్కొంది. తెలుగు రాష్ట్రాలకు ఈ బడ్జెట్‌లో గణనీయమైన ప్రాధాన్యం దక్కింది. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంత ఖనిజాల వినియోగానికి ప్రత్యేక కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్‌ను దక్షిణ భారత ఆర్థిక ఇంజిన్‌గా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో పలు ప్రాజెక్టులకు మద్దతు ప్రకటించారు. పుణె-హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్--చెన్నై మార్గాల్లో బుల్లెట్ రైలు కారిడార్లకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం తెలంగాణకు కీలకంగా మారనుంది.పన్నుల విషయంలో ఆదాయపు పన్ను శ్లాబుల్లో పెద్ద మార్పులు చేయకుండా, కొత్త ఐ--టి పన్నును ఏప్రిల్ 1 నుంచి అమలు చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. డిజిటల్, క్లౌడ్ రంగాల అభివృద్ధికి ఊతమిస్తూ డేటా సెంటర్లకు 2047 వరకు పన్ను మినహాయింపులు ప్రకటించారు. మొత్తం మీద ఈ బడ్జెట్ పెద్ద సంచలనాలకన్నా, మౌలిక వసతులు, ఆర్థిక స్థిరత్వం, దీర్ఘకాలిక అభివృద్ధిపై దృష్టి పెట్టిన సాదాసీదా బడ్జెట్‌గా ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# కేంద్ర బడ్జెట్ 2026లో తెలుగు రాష్ట్రాల కేటాయింపులు

**హైస్పీడ్ రైలు, టూరిజానికి ప్రాధాన్యం**
**రేర్ ఎర్త్ కారిడార్లతో ఏపీకి అవకాశం**
**ఈస్ట్ కోస్ట్ కారిడార్‌తో తీరప్రాంత లాభం**
**అమరావతి, హైదరాబాద్ మెట్రోకు నిరాశ**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1**
కేంద్ర బడ్జెట్ 2026--27లో తెలుగు రాష్ట్రాలకు పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించారు. హైస్పీడ్ రైలు కారిడార్లు, టూరిజం అభివృద్ధి, రేర్ ఎర్త్ కారిడార్లు వంటి కీలక అంశాలను బడ్జెట్‌లో ప్రకటించారు. దీంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కొంత ఊరట లభించినప్పటికీ, కొన్ని కీలక ప్రాజెక్టుల విషయంలో మాత్రం నిరాశ తప్పలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. టూరిజం రంగంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం దక్కింది. అరకు వ్యాలీలో పర్యావరణ అనుకూలమైన మౌంటైన్ ట్రయల్స్‌ను అభివృద్ధి చేయనున్నారు. ట్రెక్కింగ్, హైకింగ్‌కు కొత్త డెస్టినేషన్‌గా అరకును ప్రోత్సహించనున్నారు. అలాగే పులికట్ సరస్సు పరిసరాల్లో బర్డ్-వాచింగ్ ట్రయల్స్ అభివృద్ధి చేసి నేచర్ టూరిజాన్ని పెంపొందించడంతో పాటు, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా హోమ్‌స్టేలు, గైడ్ల క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నారు. బౌద్ధ, హెరిటేజ్ టూరిజం పథకాల ద్వారా కూడా ఆంధ్రప్రదేశ్‌కు పరోక్ష ప్రయోజనాలు దక్కనున్నాయి.రవాణా రంగంలో మూడు కీలక హైస్పీడ్ రైల్ కారిడార్లను ప్రతిపాదించారు. పూణే--హైదరాబాద్, హైదరాబాద్--బెంగళూరు, హైదరాబాద్--చెన్నై మధ్య హైస్పీడ్ రైలు మార్గాలు నిర్మించనున్నారు. దీని ద్వారా హైదరాబాద్ కు ప్రత్యక్ష లాభం కలగనుండగా, దక్షిణ ఆంధ్రప్రదేశ్‌కు పరోక్షంగా కనెక్టివిటీ పెరగనుంది. అలాగే ఈస్ట్ కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్ (పూర్వోదయ) కింద తూర్పు తీరంలో ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను అభివృద్ధి చేయనున్నారు. దుర్గాపూర్ నోడ్‌తో అనుసంధానమయ్యే ఈ కారిడార్ ద్వారా ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంత పోర్టులు, పరిశ్రమలు, లాజిస్టిక్స్ రంగాలు ప్రధాన లబ్ధిదారులుగా మారనున్నాయి. మరోవైపు ఒడిశా, కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో రేర్ ఎర్త్ మినరల్స్ మైనింగ్, ప్రాసెసింగ్, పరిశోధన, తయారీ కోసం ప్రత్యేక రేర్ ఎర్త్ కారిడార్లను ఏర్పాటు చేయనున్నారు. అయితే బడ్జెట్‌లో ఏపీ రాజధాని అమరావతి కు నిధులు కేటాయించకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసింది. ఇటీవల కేంద్రం విడుదల చేసిన ఆర్థిక సర్వేలో అమరావతి ప్రస్తావన రావడంతో భారీ నిధులు కేటాయిస్తారనే ఆశలు ఏర్పడ్డాయి. కానీ బడ్జెట్‌లో అమరావతికి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడంతో ఆ ఆశలు ఆవిరయ్యాయి. అలాగే తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేస్తున్న హైదరాబాద్ మెట్రో విస్తరణకు కూడా నిధులు కేటాయించలేదు. తెలంగాణలోని ఇతర ప్రధాన ప్రాజెక్టులకు కూడా బడ్జెట్‌లో ప్రాధాన్యం లభించకపోవడంతో, అభివృద్ధి ప్రకటనలతో పాటు నిరాశ కలిగించిన బడ్జెట్‌గా తెలుగు రాష్ట్రాల్లో చర్చ కొనసాగుతోంది.

# వికసిత భారత్ 2047కు దారి చూపే బడ్జెట్ : మోదీ

**కేంద్ర బడ్జెట్‌పై ప్రధాని ప్రశంసలు**
**భవిష్యత్ లక్ష్యాలతో రూపొందించిన బడ్జెట్**
**మహిళా శక్తి, సాధికారతకు ప్రతిబింబం**
**మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ దిశగా భారత్**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1**



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్--2026పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల జల్లు కురిపించారు. ఇది మనం కలగంటున్న వికసిత భారత్ 2047 లక్ష్యానికి సరైన దిశను చూపే బడ్జెట్‌గా మోదీ అభివర్ణించారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ బడ్జెట్ చారిత్రాత్మకమని ఆయన వ్యాఖ్యానించారు. తాజా బడ్జెట్‌పై ప్రధాని ఒక వీడియో ప్రకటన విడుదల చేశారు. ఈ వీడియోలో బడ్జెట్‌పై తన అభిప్రాయాలను వెల్లడించారు. "ఈ బడ్జెట్ దేశంలోని మహిళా శక్తికి, మహిళల సాధికారతకు ప్రతిబింబం. మహిళా ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టి చరిత్ర సృష్టించారు" అని మోదీ పేర్కొన్నారు. ఇది మహిళల పాత్రకు ఇచ్చిన గౌరవమని ఆయన అన్నారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనే భారత ఆకాంక్షలకు అనుగుణంగా ఈ బడ్జెట్ రూపొందిందని ప్రధాని తెలిపారు. 140 కోట్ల మంది ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ఇది ప్రతిబింబమని చెప్పారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మాత్రమే కాకుండా, ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ నిలవాలని ప్రజలు కోరుకుంటున్నారని మోదీ వ్యాఖ్యానించారు. వికసిత భారత్ 2047కు ఈ బడ్జెట్ మార్గనిర్దేశం చేస్తుందని ప్రధాని స్పష్టం చేశారు. కొత్త అవకాశాలకు ఇది రహదారిలాంటిదని, ప్రజల ఆకాంక్షలు కార్యరూపం దాల్చేలా భారత భవిష్యత్‌ను బలోపేతం చేస్తుందని అన్నారు. మూలధన వ్యయం, ఆర్థిక వృద్ధి మధ్య సమతుల్యతను పాటించిన బడ్జెట్‌గా దీన్ని మోదీ అభివర్ణించారు.

# కొబ్బరి-జీడి పరిశ్రమలకు ఊతం జాతీయ కొబ్బరి మిషన్ ఏర్పాటు

**- మత్స్య రంగానికి 500 కొత్త రిజర్వాయర్లు**
**- మహిళా సాధికారతకు షీ మార్ట్‌లు, హాస్పిటాలిటీ సంస్థ**
**- పూర్వోదయతో తూర్పు తీరానికి పారిశ్రామిక బలం**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1



కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కొబ్బరి, జీడి పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రకటించారు. దేశంలో కొబ్బరి సాగు, ఉత్పత్తి, విలువ జోడింపును బలోపేతం చేయడానికి 'జాతీయ కొబ్బరి మిషన్' ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 30 లక్షల మంది కొబ్బరి సాగు రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని, వారి ఆదాయం పెంచడమే ఈ మిషన్ లక్ష్యమని పేర్కొన్నారు. కొత్త కొబ్బరి తోటల ఏర్పాటుకు, ఉన్న తోటల్లో కొత్త మొక్కలు నాటుకునేందుకు రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తామని స్పష్టం చేశారు.మత్స్యరంగ అభివృద్ధిలో భాగంగా దేశవ్యాప్తంగా చేపల పెంపకం కోసం 500 కొత్త రిజర్వాయర్లు ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, మత్స్య ఉత్పత్తి గణనీయంగా మెరుగవుతుందని తెలిపారు. మత్స్యకారులకు స్థిరమైన ఆదాయం కల్పించడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.మహిళా సాధికారతకు కేంద్ర ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపడుతున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. మహిళా ఉద్యమకారులకు మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు షీ మార్ట్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే సేవారంగ అభివృద్ధిలో భాగంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఆరోగ్య రంగంలో మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ రాంచీ, తేజ్‌పూర్‌లలో నేషనల్ మెంటల్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రాంతీయ అభివృద్ధిలో భాగంగా 'పూర్వోదయ' కార్యక్రమం కింద తూర్పు తీరంలో ప్రత్యేక పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు నిర్మల సీతారామన్ తెలిపారు. తూర్పు రాష్ట్రాల ఆర్థికాభివృద్ధికి ఇది కీలకంగా మారనుందని చెప్పారు. పూర్వోదయ రాష్ట్రాలకు ఐదు విద్యుత్ బస్సులు కేటాయించి పర్యావరణహిత రవాణాకు ప్రోత్సాహం ఇస్తామని వెల్లడించారు.ఈశాన్య భారతంలో పర్యాటక అభివృద్ధి కోసం బౌద్ధ సర్క్యూట్ల ఏర్పాటుకు ప్రత్యేక మిషన్‌ను ప్రకటించారు. థేరవాద, మహాయాన బౌద్ధ క్షేత్రాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు రాష్ట్రాలకు రూ.4 లక్షల కోట్లకు పైగా నిధులు విడుదల చేయనున్నట్లు, పన్నుల్లో రాష్ట్రాల వాటాను 41 శాతంగా కొనసాగిస్తున్నట్లు ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. ఈ బడ్జెట్ ద్వారా వ్యవసాయం, పరిశ్రమలు, మౌలిక వసతులు, ప్రాంతీయ సమతుల్య అభివృద్ధికి ప్రభుత్వం స్పష్టమైన దిశను నిర్దేశించిందని ఆమె పేర్కొన్నారు.

# ముగిసిన కేసీఆర్ సిట్ విచారణ

**నందినగర్ నివాసంలో 4 గంటల 45 నిమిషాల విచారణ**
**ఆడియో-వీడియో రికార్డింగ్‌తో ప్రశ్నలు**
**విచారణ అనంతరం కేటీఆర్, హరీశ్ రావుతో చర్చ**
**నల్ల బ్యాడ్జీలతో బీఆర్ఎస్ నేతల నిరసన**



**హైదరాబాద్, ఫిబ్రవరి 1**
ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై సిట్ అధికారులు చేపట్టిన విచారణ ముగిసింది. హైదరాబాద్ నందిన గర్‌లోని ఆయన నివాసంలో సుమారు 4 గంటల 45 నిమిషాలపాటు విచారణ కొనసాగింది. ఇప్పటికే ఈ కేసులో విచారించిన వ్యక్తులు వెల్లడించిన అంశాల ఆధారంగా కేసీఆర్‌ను ప్రశ్నించినట్లు సమాచారం. విచారణ మొత్తం ఆడియో, వీడియో రూపంలో రికార్డు చేసినట్లు అధికారులు తెలిపారు. రెండోసారి నోటీసులు జారీ చేసిన సిట్ అధికారులు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నందినగర్ నివాసంలోని రెండో అంతస్తు గదిలో విచారణ ప్రారంభించారు. సుదీర్ఘ విచారణ అనంతరం కేసీఆర్ తన కుటుంబసభ్యులు, పార్టీ నేతలతో మాట్లాడినట్లు తెలుస్తోంది. విచారణ ముగిసిన తర్వాత కేటీఆర్, హరీశ్ రావు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌లతో కేసీఆర్ చర్చించినట్లు సమాచారం.ఇదిలా ఉండగా, మచ్చలేని నేతను విచారణ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. పోలీసులు అడుగడుగునా బీఆర్ఎస్ శ్రేణులను అడ్డుకోవడంతో వారు తెలంగాణ భవన్‌లో ఆందోళనకు దిగారు. ఈ ఘటనతో రాష్ట్ర రాజకీయ వర్గాల్లో మరోసారి చర్చ ఊపందుకుంది.

# కేసీఆర్‌ను ముట్టుకుంటే రాష్ట్రం అగ్నిగుండం : పట్నం నరేందర్‌రెడ్డి

**సిట్ నోటీసులపై తీవ్ర ఆగ్రహం**
**మద్దూరులో బీఆర్ఎస్ ధర్నా, బైక్ ర్యాలీ**
**రాజకీయ వేధింపులకే కాంగ్రెస్ పాలన**
**కొడంగల్‌లో ప్రభుత్వానికి గట్టి ప్రతిఘటన హెచ్చరిక**



**మద్దూరు, ఫిబ్రవరి 1** ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా కేసీఆర్ కు సిట్ విచారణ నోటీసులు ఇవ్వడాన్ని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌ను ముట్టుకుంటే రాష్ట్రం అగ్నిగుండంలా మారుతుందని హెచ్చరించారు. ఈ నోటీసులు పూర్తిగా రాజకీయ వేధింపుల్లో భాగమేనని ఆయన మండిపడ్డారు. సిట్ నోటీసులను నిరసిస్తూ మద్దూరు మున్సిపల్ కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. అనంతరం బైక్ ర్యాలీ చేపట్టారు. బీఆర్ఎస్ కార్యకర్తల బైక్ ర్యాలీతో మద్దూరు మున్సిపాలిటీ గులాబీ జెండాలతో నిండిపోయింది. పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొని కేసీఆర్‌కు మద్దతుగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, కొడంగల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుందని అన్నారు. పాలన చేతగాక, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకు కేసీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి వేధింపులను బీఆర్ఎస్ శ్రేణులు సహించబోవని స్పష్టం చేశారు. కేసీఆర్ జోలికి వస్తే రేవంత్ రెడ్డి తో పాటు కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టి ప్రతిఘటన ఎదురవుతుందని పట్నం నరేందర్‌రెడ్డి హెచ్చరించారు. కేసీఆర్‌పై రాజకీయ వేధింపులు కొనసాగితే కొడంగల్ నుంచే ఉద్యమం ఉద్ధృతం చేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు.

# నందినగర్‌లో కేసీఆర్ సిట్ విచారణ..

**భావోద్వేగానికి లోనైన మాజీ సీఎం**
**తెలంగాణ సాధన గదిలోనే దర్యాప్తు**
**న్యాయవాదులకు అనుమతి నిరాకరణ**

**హైదరాబాద్, ఫిబ్రవరి 1**
ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సిట్ విచారణను ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్ నందినగర్‌లోని ఆయన నివాసంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి విచారణ ప్రారంభమైంది. విచారణకు ముందు మధ్యాహ్న భోజన సమయంలో కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి లోనైనట్లు సమాచారం. తెలంగాణ సాధనకు వ్యూహరచన చేసిన అదే గదిలో ఇప్పుడు విచారణ ఎదుర్కోవాల్సి రావడం తనను తీవ్రంగా కలచివేసిందని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. "స్వరాష్ట్ర సాధన కోసం ఇదే గదిలో ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాను. కీలక చర్చలు జరిపాను. అలాంటి చోట ఈ పరిస్థితి వస్తుందని ఊహించలేదు" అని ఆయన వ్యాఖ్యానించినట్టు వర్గాలు తెలిపాయి. విచారణ నేపథ్యంలో నందినగర్ పరిసరాల్లో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. భారీ బందోబస్తును మోహరించారు. విచారణ ప్రారంభం కాగానే మాజీ మంత్రి హరీష్ రావు తో పాటు ఇతర నేతలను నివాసం నుంచి బయటకు పంపించారు. నిబంధనల ప్రకారం కేసీఆర్ తరఫున న్యాయవాదులను లోపలికి అనుమతించేందుకు సిట్ అధికారులు నిరాకరించినట్లు సమాచారం.ఎర్రవల్లి ఫామ్‌హౌస్ నుంచి ఉదయం నందినగర్‌కు చేరుకున్న కేసీఆర్ మధ్యాహ్నం నుంచి సిట్ విచారణలో పాల్గొన్నారు. ఈ కేసు విచారణ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# సమ్మక్క-సారలమ్మ ఆశీస్సులతో మేడారం మహాజాతర ఘన విజయం

- భక్తుల సహకారంతో చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహణ
- ముందస్తు ప్రణాళికలు, నూతన అభివృద్ధి పనులు ఫలితం
- అధికార యంత్రాంగం సమన్వయమే విజయానికి మూలం: మంత్రి సీతక్క



**మేడారం, ఫిబ్రవరి 1**
మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర ఈ ఏడాది అత్యంత ఘనంగా, చరిత్రలో నిలిచిపోయే విధంగా విజయవంతంగా ముగిసిందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. కోట్లాది మంది భక్తులు ఎలాంటి అసౌకర్యాలు ఎదుర్కోకుండా తల్లులను ప్రశాంతంగా దర్శించుకోవడం ప్రభుత్వ యంత్రాంగం సాధించిన గొప్ప విజయమని ఆమె పేర్కొన్నారు. తల్లుల వనప్రవేశం అనంతరం మేడారంలోని మీడియా సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. జాతర నిర్వహణకు ముందే రూపొందించిన సమగ్ర ప్రణాళికలు, స్పష్టమైన వ్యూహాలు, శాఖల మధ్య సమన్వయంతో చేపట్టిన ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఫలించాయని మంత్రి సీతక్క తెలిపారు. రవాణా సౌకర్యాలు, వైద్య సేవలు, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్, అగ్నిమాపక, పోలీస్ భద్రత వంటి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయడం వల్ల జాతర ఎక్కడా అంతరాయం లేకుండా సాగిందని వివరించారు. ఈ ఏడాది జాతరకు ప్రత్యేక ఆకర్షణగా నూతనంగా చేపట్టిన అభివృద్ధి పనులు నిలిచాయని మంత్రి పేర్కొన్నారు. అమ్మవార్ల గద్దెల ప్రాంగణాలను మరింత సౌకర్యవంతంగా, శోభాయమానంగా తీర్చిదిద్దడం వల్ల భక్తులకు మెరుగైన అనుభూతి లభించిందని తెలిపారు. గద్దెల పరిసరాల్లో విస్తరణ, పాదచారులకు అనుకూల మార్గాలు, శాశ్వత మౌలిక వసతులు జాతర ప్రతిష్టను మరింత పెంచాయని అన్నారు. సంప్రదాయం-ఆధునిక సదుపాయాలు సమన్వయమై మేడారం మహాజాతరకు మరింత శోభ చేకూరిందని మంత్రి సీతక్క తెలిపారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా చేపట్టిన ఈ అభివృద్ధి పనులు మేడారం చారిత్రక ప్రాధాన్యతను మరింత బలపరుస్తాయని ఆమె పేర్కొన్నారు. ఈ మహాజాతరను విజయవంతం చేయడంలో అహర్నిశలు కృషి చేసిన జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, స్వచ్ఛంద సేవకులు, సహకరించిన ప్రతి ఒక్కరికీ మంత్రి సీతక్క హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గుడి అభివృద్ధి పనులు ప్రారంభమైన నాటి నుంచి కొన్ని శక్తులు దుష్ప్రచారం చేశాయని, జాతర సందర్భంగా కూడా సోషల్ మీడియా వేదికగా గందరగోళం సృష్టించే ప్రయత్నాలు జరిగాయని మంత్రి పేర్కొన్నారు. అయితే భక్తులు వాటిని తిప్పికొట్టి తల్లుల సేవలో తరించారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో యుద్ధప్రాతిపదికన వంద రోజుల్లోనే మేడారం అభివృద్ధి పనులను పూర్తి చేశామని, మేడారం చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిలో నిలిచిపోతుందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన మంత్రివర్గ సహచరులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సహనం, సహకారం వల్లే మేడారం జాతర ఇంత ఘనంగా విజయవంతమైందని పేర్కొంటూ, సమ్మక్క--సారలమ్మ ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, సుఖసంతోషాలు, సమృద్ధి కలగాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

# భారత సంక్షోభాలపై కేంద్రం గుడ్డి వైఖరి : రాహుల్ గాంధీ

- బడ్జెట్‌పై తీవ్ర విమర్శలు - ఉద్యోగాలు, తయారీ రంగంపై ఆందోళన
- దేశం నుంచి తరలిపోతున్న పెట్టుబడులు - వాస్తవ సమస్యలను విస్మరించిందన్న ఆరోపణ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1**
కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ బడ్జెట్ భారతదేశం ఎదుర్కొంటున్న అసలైన సంక్షోభాలను పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతాలో స్పందించారు. దేశంలో యువతకు ఉద్యోగాలు దొరకడంలేదని, తయారీ రంగం కుదేలవుతోందని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడులు దేశం నుంచి బయటకు తరలిపోతున్నాయని, కుటుంబాల పొదుపు క్రమంగా తగ్గిపోతున్నదని పేర్కొన్నారు. రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, వాటికి పరిష్కార మార్గాలు చూపడంలో ఈ బడ్జెట్ విఫలమైందని విమర్శించారు. ఉద్యోగాలు లేని యువత, పడిపోతున్న తయారీ రంగం, దేశం నుంచి తరలిపోతున్న పెట్టుబడులు, కుప్పకూలుతున్న కుటుంబ పొదుపు, రైతుల కష్టాలు, ప్రపంచ ఆర్థిక సంక్షోభ ముప్పు వంటి అంశాలను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. దిద్దుబాటు చర్యలకు నిరాకరించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం వాస్తవ పరిస్థితుల పట్ల గుడ్డిగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ఇదిలా ఉండగా, బడ్జెట్‌పై స్పందించాల్సిందిగా పార్లమెంట్ ఆవరణలో మీడియా ప్రతినిధులు కోరగా, ఈ అంశంపై రేపు పార్లమెంట్‌లోనే విపులంగా మాట్లాడుతానని రాహుల్ గాంధీ తెలిపారు. కేంద్ర బడ్జెట్‌పై ప్రతిపక్షం తరఫున గట్టి వాదనలు వినిపించనున్నట్లు ఆయన సంకేతాలు ఇచ్చారు.



# కేంద్ర బడ్జెట్ తెలంగాణను తీవ్రంగా నిరాశపరిచింది : భట్టి విక్రమార్క

- రాష్ట్ర విజ్ఞప్తులను విస్మరించిన కేంద్రం
- హైదరాబాద్, టూరిజం, పరిశ్రమలకు అన్యాయం
- ఎస్సీ--ఎస్టీ, గ్రామీణ పేదలపై ప్రభావం
- తెలంగాణ హక్కుల కోసం పార్లమెంట్‌లో పోరాటానికి పిలుపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 1**
కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ తెలంగాణ ప్రజలను తీవ్రంగా నిరాశపరిచిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి, మంత్రివర్గ బృందం స్వయంగా ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి, కేంద్ర ఆర్థిక మంత్రిని కలిసి అనేక విజ్ఞప్తులు చేసినప్పటికీ, ఒక్కదాన్నీ పరిగణనలోకి తీసుకోకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. కోవిడ్ సమయంలో భారత్ బయోటెక్ ద్వారా ప్రపంచానికే ప్రాణవాయువు అందించిన హైదరాబాద్ ను ఫార్మా హబ్ కేటాయింపుల్లో విస్మరించడం అన్యాయమని భట్టి విక్రమార్క మండిపడ్డారు. అలాగే ఆడియో--వీడియో, గేమింగ్ రంగాల్లో దేశానికే దిక్సూచిగా ఉన్న హైదరాబాద్‌ను పక్కనపెట్టి, 'ఆరెంజ్ ఎకానమీ'ని ముంబైకి తరలించడం వెనుక ఉద్దేశమేంటని ప్రశ్నించారు. రీజినల్ మెడికల్ వ్యాల్యూ హబ్‌ల ఏర్పాటులో తెలంగాణ పేరు లేకపోవడం రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే చర్యగా అభివర్ణించారు. టూరిజం రంగంలోనూ తెలంగాణను పూర్తిగా విస్మరించారని ఆయన ఆరోపించారు. రామప్ప దేవాలయం వంటి యునెస్కో వారసత్వ కట్టడాలు, మేడారం వంటి అంతర్జాతీయ గుర్తింపు పొందిన జాతరలు ఉన్నప్పటికీ, తెలంగాణను టూరిజం ప్యాకేజీలో చేర్చకపోవడం శోచనీయమన్నారు. సెమీకండక్టర్ పరిశ్రమల కోసం రాష్ట్రం చేసిన విజ్ఞప్తులను తోసిపుచ్చి, ఇతర రాష్ట్రాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా తెలంగాణ యువత ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. సింగరేణి సంస్థ రేర్ ఎర్త్ మినరల్స్ రంగంలో చేస్తున్న కృషిని కూడా కేంద్రం గుర్తించకపోవడం సరికాదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించడమే కాకుండా, గ్రామీణ పేదల జీవనాధారమైన ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచేలా కేంద్రం వ్యవహరిస్తోందని భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం తన ద్రవ్య లోటు పరిమితిని 4.3 శాతానికి పెంచుకున్నప్పటికీ, రాష్ట్రానికి మాత్రం 4 శాతం పరిమితి కూడా అనుమతించకపోవడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. తెలంగాణ దేశంలో అంతర్భాగం కాదా అని ప్రశ్నించారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న తెలంగాణ లక్ష్యానికి కేంద్రం తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉందని, రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర పార్లమెంట్ సభ్యులందరూ ఈ అన్యాయంపై గళమెత్తాలని, పార్లమెంట్‌లో తెలంగాణ హక్కుల కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.



## టీవీ సీరియల్‌లా 'ఫోన్ ట్యాపింగ్' దర్యాప్తు

- ఇప్పటికే రెండేళ్లు.. ఇంకెన్నేళ్లు చేస్తారో..?
- డబ్బుల వాటాల కోసం మంత్రుల కొట్లాట: కిషన్‌రెడ్డి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1** ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తును టీవీ సీరియల్ లాగా సాగదీస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. దర్యాప్తు మొదలై ఇప్పటికే రెండేళ్లకు పైగా అవుతోందన్నారు. కేసీఆర్ కుమార్తె కవితనే తన భర్త ఫోన్ ట్యాప్ అయిందని ఆరోపించారని గుర్తుచేశారు. హైకోర్టు జడ్జిల ఫోన్లు ట్యాప్ అయ్యాయంటూ రాష్ట్ర పోలీసులు హైకోర్టులో అఫిడవిట్ వేశారని, ఇంకెన్నేళ్లు దర్యాప్తు చేస్తారని ప్రశ్నించారు. ఢిల్లీలోని తన నివాసంలో ఆదివారం మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ట్యాపింగ్ ఎవరు చేసినప్పటికీ ప్రభుత్వం ద్వారా జరిగిందనేది వాస్తవమని, అందరి ఫోన్లూ ట్యాప్ అయ్యాయని చెప్పారు. ట్యాపింగ్ తీవ్రమైన నేరారోపణ ఉన్న కేసు అని, ఈ ఘటనలో కఠినంగా వ్యవహరించాలని సూచించారు. కాంగ్రెస్, బీఆర్ఎ?సలు అవినీతికి కొమ్ముకాస్తున్నాయని, ఆ పార్టీలపై ప్రజలకు విశ్వాసం లేదన్నారు. తెలంగాణ ప్రజలు ఈ రెండు పార్టీలకు బుద్ధి చెబుతార పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబం ఆస్తుల వాటాల కోసం కొట్టుకుంటుంటే రేవంత్ సర్కారులో మంత్రులు కూడా రోడ్డున పడి డబ్బుల వాటాల కోసం కొట్లాడుకుంటున్నారని ఆరోపించారు.

## బడ్జెట్ అబద్ధాల కుప్ప : మమతా బెనర్జీ

- విజన్, మిషన్ లేని బడ్జెట్
- పేదలు, మహిళలు, రైతులకు అన్యాయం
- విద్య-సామాజిక భద్రతకు కోత
- పశ్చిమబెంగాల్‌కు నిధులేవీ లేవు

**కోల్‌కతా, ఫిబ్రవరి 1:** కేంద్ర బడ్జెట్‌పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రస్థా యిలో విమర్శలు గుప్పించారు. ఈ బడ్జెట్‌కు స్పష్టమైన దిశానిర్దేశం లేదని, విజన్, మిషన్ రెండూ కనిపించడంలేదని ఆమె మండిపడ్డారు. ఇది పూర్తిగా అబద్ధాలతో నిండిన బడ్జెట్‌గా అభివర్ణించారు. ఢిల్లీ పర్యటనకు బయలుదేరేముందు కోల్‌కతా విమానాశ్రయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ బడ్జెట్ దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం కాకుండా సర్వనాశనం చేసేలా ఉందని మమత ఆరోపించారు. పేదలు, మహిళలు, రైతులు, యువత, సామాన్య ప్రజలతో పాటు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు కూడా ఈ బడ్జెట్ ద్రోహం చేసిందని విమర్శించారు. ప్రజల జీవన వ్యయం పెరుగుతున్న సమయంలో ఊరటనిచ్చే చర్యలు ఇందులో లేవన్నారు. విద్యా రంగానికి తగిన కేటాయింపులు లేవని మమత ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా సబ్సిడీ, సామాజిక భద్రతా సబ్సిడీ, ఎరువుల సబ్సిడీలను తగ్గించడం ద్వారా పేదలపై మరింత భారం మోపుతున్నారని అన్నారు. ఈ నిర్ణయాలు భవిష్యత్ తరాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. పశ్చిమబెంగాల్‌కు కేంద్ర బడ్జెట్‌లో ఒక్క పైసా కూడా కేటాయించలేదని మమతా బెనర్జీ ఆరోపిం చారు. జీఎస్టీ రూపంలో రాష్ట్రాల నుంచి వసూలు చేసిన డబ్బును తిరిగి ఇవ్వడంలో కూడా వివక్ష చూపుతున్నారని విమర్శించారు. ప్రజల డబ్బుతో నడిచే ప్రభుత్వానికి పాలించే నైతిక హక్కు లేదని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు.

## మలయాళీగా బడ్జెట్ నిరాశపరిచింది : శశిథరూర్

- బడ్జెట్‌లో కేరళ ప్రస్తావన లేదని ఆవేదన
- ఆయుర్వేదం, మత్స్యకారులపై మౌనం
- మధ్యతరగతికి ఊరట లేదని విమర్శ
- భవిష్యత్ దిశపై స్పష్టత కరువు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1** కేంద్ర బడ్జెట్ తనను సంతృప్తిపర్చలేదని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ వ్యాఖ్యానించారు. ఒక మలయాళీగా బడ్జెట్‌పై తనకు తీవ్ర నిరాశ కలిగిందని తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో కేరళ పేరునే ప్రస్తావించకపోవడం ఆశ్చర్యానికి గురి చేసిందని ఆయన అన్నారు. ఆయుర్వేదం విషయంలో కేరళకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని శశిథరూర్ గుర్తు చేశారు. ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేదాన్ని కేరళలో ఏర్పాటు చేస్తామని ప్రకటన వస్తుందని ఆశించామని, కానీ ఆ ప్రస్తావన బడ్జెట్‌లో ఎక్కడా కనిపించలేదని అన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేస్తామని చెప్పినా, అది ఎక్కడ అనే విషయాన్ని కూడా స్పష్టం చేయలేదని విమర్శించారు. అలాగే మత్స్యకారులు, కొబ్బరి తోటల విషయంలో కూడా కేరళ పేరు బడ్జెట్‌లో ప్రస్తావనకు రాకపోవడం శోచనీయమని శశిథరూర్ అన్నారు. కేరళ ఆర్థిక వ్యవస్థకు ఈ రంగాలు ఎంతో కీలకమైనవని, అయినప్పటికీ కేంద్ర బడ్జెట్‌లో వాటిపై దృష్టి పెట్టకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. గత కొన్నేళ్ల బడ్జెట్ ప్రసంగాలతో పోలిస్తే ఈసారి ప్రసంగం చాలా చిన్నదిగా ఉందని శశిథరూర్ అభిప్రాయపడ్డారు. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలకు ఊరటనిచ్చే ప్రోత్సాహక చర్యలు ఏవీ లేవని విమర్శించారు. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం ఏం చేయబోతోందన్న దానిపై స్పష్టత కనిపించడంలేదన్నారు. అలాగే ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కోసం 15 ఏళ్లుగా ఎదురుచూస్తున్నా, దానిపై కూడా ఎలాంటి ప్రకటన రాకపోవడం నిరాశ కలిగించిందని శశిథరూర్ తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి : పొన్నం ప్రభాకర్

- మహబూబాబాద్ జిల్లాలో విస్తృత పర్యటన
- కాంగ్రెస్ ముఖ్య నేతలతో సమన్వయ సమావేశం
- ఏకాభిప్రాయం లేని వార్డులపై సర్వేల ఆధారంగా టికెట్లు
- పొత్తులో భాగంగా సీపీఐతో కలిసి పని చేయాలని పిలుపు

**మహబూబాబాద్, ఫిబ్రవరి 1:** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలని, అన్ని స్థానాల్లో పార్టీ అభ్యర్థులు గెలిచేలా నేతలంతా సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో చర్చలు జరిపారు.



ఈ సమావేశంలో మహబూబాబాద్, ఇల్లందు, కేసముద్రం మున్సిపాలిటీలకు చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు మురళీ నాయక్, కోరం కనకయ్య, డీసీసీ అధ్యక్షులు ఉమా మురళీ నాయక్, దేవి ప్రసన్నతో పాటు ఇతర ముఖ్య నేతలు హాజరయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో పని చేయాలని పొన్నం ప్రభాకర్ సూచించారు. ఏకాభిప్రాయం లేని వార్డుల విషయంలో ముఖాముఖి చర్చలు జరిపి, సర్వేల ఆధారంగానే పార్టీ టికెట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అందరూ కలిసి పనిచేయాలని ఆయన కోరారు. మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి కీలకమైనవని, క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని నిరూపించాల్సిన అవసరం ఉందని అన్నారు. పొత్తులో భాగంగా సీపీఐ పోటీ చేస్తున్న స్థానాల్లో కాంగ్రెస్, సీపీఐ కలిసి పనిచేయాలని పొన్నం ప్రభాకర్ సూచించారు. కూటమి ఐక్యతను కాపాడుతూ ముందుకు సాగాలని ఆయన నేతలకు దిశానిర్దేశం చేశారు. అలాగే మహబూబాబాద్, ఇల్లందు, కేసముద్రం మున్సిపాలిటీల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు డీసీసీ అధ్యక్షుల ద్వారా బి-ఫారాలు అందజేసినట్లు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేలా సమష్టిగా కృషి చేయాలని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు.




## మాస్ పల్స్ తెలిసింది

అగ్ర హీరోలతో కలసి భారీ చిత్రాల్లో నటిస్తున్నా.. మంగళూరు సోయగం పూజాహెగ్డేకు అదృష్టం కలిసి రావడం లేదు. బాక్సాఫీస్ ఫలితాల పరంగా ఈ భామ కాస్త నిరుత్సాహంగా ఉంది. అయితే అవకాశాలపరంగా ఎలాంటి లోటులేదని, ఈ ఏడాది బ్లాక్‌బస్టర్ హిట్‌తో ముందుకొస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నది. తాజా ఇంటర్వ్యూలో కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను పంచుకుందీ భామ. కెరీర్ ఆరంభం నుంచి కమర్షియల్ సినిమాల్లో నటించడం వల్ల మాస్ పల్స్‌ని బాగా అర్థం చేసుకున్నానని తెలిపింది. గ్లామర్ రోల్స్ కాస్త బోర్? అనిపించినా.. తన స్క్రీన్?ప్రజెన్స్? చూసి ఆత్మవిశ్వాసాన్ని పెంచుకున్నానని ఈ సొగసరి చెప్పుకొచ్చింది. 'ఇప్పుడు గ్లామర్? రోల్స్?పై ఏమాత్రం మక్కువ లేదు. ప్రభావవంతమైన పాత్రలు చేస్తేనే కెరీర్?లో లాంగ్విటీ ఉంటుందనే విషయం అర్థమైంది. ఇక ఇండస్ట్రీలో పోటీ గురించి నేను అస్సలు ఆలోచించను. ప్రతిభ ఉంది కాబట్టే ఇప్పటికీ భారీ చిత్రాల్లో అవకాశాలొస్తున్నాయి. భవిష్యత్తులో నటిగా సవాళ్లను స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నా' అని పూజాహెగ్డే పేర్కొన్నది. ఈ భామ దళపతి విజయ్?తో కలిసి నటించిన 'జన నాయగన్?' చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది.

## ఎమోషనల్ లవ్ డ్రామా నిలవే




సౌమిత్ పోలాడి హీరోగా నటిస్తూ సాయి కె.వెన్నంతో కలిసి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'నిలవే'. శ్రేయాసి సేన్ కథానాయిక. రాజ్ అల్లాడ, గిరిధర్‌రావు పోలాడి, సాయి కె.వెన్నం నిర్మాతలు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉన్నది. ప్రేమికుల రోజు కానుకగా ఫిబ్రవరి 13న సినిమాను విడుదల చేయనున్నట్టు మంగళవారం ఓ ప్రకటన ద్వారా మేకర్స్ తెలిపారు. ఎమోషన్స్‌తో కూడిన మ్యూజికల్ లవ్ డ్రామా ఇదని, ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేలా సినిమా రూపొందుతున్నదని మేకర్స్ తెలిపారు. హర్ష చెముడు, సుప్రియా ఐసోలా, నీవన్ కుమార్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: దిలీప్ కె.కుమార్, సంగీతం: కల్యాణ్ నాయక్, నిర్మాణం: పీవోవీ ఆర్ట్స్ ప్రొడక్షన్స్.

## అవన్నీ అబద్ధాలే

తాజాగా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రంతో కెరీర్‌లో తొలి విజయాన్ని అందుకున్నది తెలుగమ్మాయి డింపుల్ హయాతి. త్వరలో మరికొన్ని సినిమాలతో ఈ అందాలభామ సందడి చేయనున్నది. ఇదిలావుంటే.. డింపుల్ హయాతి వివాహిత అని, తన భర్త పేరు డేవిడ్ అని ఆ మధ్య వార్తలు వచ్చాయి. ఈ విషయంపై ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు డింపుల్ స్పందిస్తూ, తన పెళ్లి గురించి క్లారిటీ ఇచ్చింది. 'నాకు పెళ్లి అయ్యిందంటూ గతంలో చాలామంది రాశారు. అవన్నీ అబద్ధాలే. నేను అవివాహితను. ఇలాంటి వార్తలు నా కెరీర్‌ని ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. అందుకే వివరణ ఇస్తున్నా.' అని చెప్పుకొచ్చింది డింపుల్ హయాతి. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ సమాధానం వైరల్ అవుతున్నది.



## స్లమ్ డాగ్‌లో విభిన్నంగా..



తమిళ అగ్రనటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరీ జగన్నాథ్ తెరకెక్కిస్తున్న విభిన్న కథాచిత్రం 'స్లమ్ డాగ్'. '33 టెంపుల్ రోడ్' అనేది ఉపశీర్షిక. పూరి కనెక్ట్స్, జెబి మోహన్? పిక్చర్స్ పతాకాలపై పూరీ జగన్నాథ్, చార్మీ కౌర్?, జెబి నారాయణరావు కొండ్రోల్లా నిర్మిస్తున్న ఈ పానిండియా చిత్రం షూటింగ్? పూర్తి చేసుకొని పోస్ట్? ప్రొడక్షన్ దశలో ఉన్నది. కన్నడ అగ్రనటుడు దునియా విజయ్? ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. మంగళవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఈ సినిమాకు చెందిన ఆయన ఫస్ట్?లుక్? పోస్టర్?ని మేకర్స్? విడుదల చేశారు. విభిన్నమైన గెటప్?లో కనిపిస్తున్న దునియా విజయ్?ని ఈ పోస్టర్?లో చూడొచ్చు. ఆయన ఎనర్జిటిక్? ఎక్స్?ప్రెషన్? ఆ పాత్రలోని ఇన్?టెన్సన్ని తెలియజేస్తున్నది.

ఇప్పటివరకూ చేయని భిన్నమైన పాత్రను ఇందులో దునియా విజయ్? చేస్తున్నారని మేకర్స్? తెలిపారు. సంయుక్త మీనన్? కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో టబు కీలక పాత్ర పోషిస్తున్నారు. బ్రహ్మాజీ, వీటీవీ గణేష్?, విజయ్?కుమార్? ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, సమర్పణ: ఛార్మీ కౌర్, నిర్మాణం: పూరీ కనెక్ట్స్.